బాగా అలసిపోయి వుండటంవల్ల గాంధీకి నిద్రొస్తూంది. విద్యార్థి డ్రైవ్ చేస్తున్నాడు. ఆరింటికే చీకటి పడింది.

అంతలో కారు పెద్ద గుంటలోపడి కుదపటంతో గాంధీ కళ్ళు విప్పాడు. దాహంతో గొంతు ఆర్చుకుపోతూంది. చుట్టూ పెద్ద బండరాళ్లు, మధ్యలో మట్టి రోడ్డు.

"మనం దారి తప్పేమనుకుంటా" అన్నాడు విద్యార్థి "మెయిన్ రోడ్డుమీద డైవర్షన్ అని వ్రాసి వుంది. దాంతో ఇటు తిప్పాను".

"నాకు దాహంగా వుంది"

"ఇప్పుడెలా ఇంత చీకట్లో"—

"కారు వెనక్కి తిప్పు"

"ఎడ్లబండి దారి ఇది. ఇక్కడ రివర్స్ అవదు"

"నాకు దాహంతో నోరు ఆర్చుకుపోతూంది"

విద్యార్థి కారు ఆపుచేశాడు. గాంధీవైపు చూసి నవ్వేడు. "నేను మీకన్నా బలమైన వాడిని కదా! ఎలా నన్ను నమ్మి ఇరవైలక్షలు తీసుకొచ్చారు?" అని అడిగాడు. అతడు సడన్‌గా యీ టాపిక్ తీసుకొచ్చేసరికి ముందు గాంధీకి అతడేం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. అర్థం అయ్యాక నవ్వేడు. "నువ్వు నన్నేం బెదిరించక్కర్లేదు. నువ్వెలాటి వాడివో— న్యాయానికి ఎంత గౌరవం ఇస్తావో నాకు తెలుసు" అన్నాడు.

విద్యార్థి కూడా నవ్వేడు. "నిజమే నేను న్యాయాన్ని గౌరవిస్తాను. మిమ్మల్ని గౌరవిస్తాను. నాకు తెలివుంది. మేలురకం పేపరు వుత్పత్తి చేయగల నేర్పు వుంది. ఇద్దరం మన జీవితాలు ఒకేచోట ప్రారంభించాం. నేను మిమ్మల్ని మొదట్నుంచీ గమనిస్తూ వచ్చాను. మీరు ఇప్పుడు కోటీశ్వరుడు కాబోతున్నారు. నేనింకా ప్లాంట్ ఇంజనీర్‌గానే వుండిపోతాను. నా తెలివిని మీరు వుపయోగించుకొని కోట్లు సంపాదిస్తున్నప్పుడు- అదే తెలివిని నా కోసం చట్టబద్ధంగా నేను ఎందుకు వుపయోగించుకోకూడదు?".

"చట్టబద్ధంగానా- ఎలా?"

"నా వాటర్ జగ్‌లో వున్న నీళ్ళని గ్లాసు ఇరవైలక్షల రూపాయలకి అమ్మటం ద్వారా?"

గాంధీ స్థాణువయ్యాడు. చుట్టూ రాళ్ళు- చీకటి అతడిని పరిహసిస్తూన్నట్టు అనిపించింది. దాహం మరింత ఎక్కువైంది. ఎక్కడా నరసంచారం వున్న జాడే కనబడలేదు.

(ఇంకా వుంది)



# రైలు పట్టాలు

టాక్సీ డ్రైవరు వేసిన సడెన్ బ్రేక్‌తో సుబ్బారావు దుబ్బున ముందుకు తూలాడు. ఆ తూలడంలో అతని చెయ్యి ముందున్న పెట్టెమీద సరిగ్గా పడడం, పడీపడగానే పెట్టె పట్టుకోడం, టాక్సీ తలుపుతీసి బయటికి రావడం, ఇంకో చేత్తో బెడ్డింగు లాగి చంకలో పెట్టుకోడం- అన్నీ ఒక్కసారే జరిగినంత వేగంలో జరిగిపోయాయి. చేతిలో వున్న పదిరూపాయలనోటు టాక్సీవాడికి అందచేసి, సుబ్బారావు పరుగు లంకించుకున్నాడు స్టేషన్లోకి. తను వెళ్ళవలసిన బండి వచ్చేసి, అతని కోసమే నిరీక్షిస్తున్నట్లు బయల్దేరడానికి సిద్ధంగా వుంది. పరుగెడుతున్న సుబ్బారావు చెవిలో గంట శబ్దం పడింది. వింటూనే చూపుకూడా అటు మరల్చి చూస్తే సిగ్నల్ ఇచ్చేసి వుంది. ఇంకా తను, ఈ ఓవర్ బ్రిడ్జి ఎక్కి, అవతలి ప్లాట్‌ఫామ్ మీదికి పరుగెత్తాలి. ఎప్పుడో మరిచిపోయిన పరుగు అవసరం కొత్తగా కలగడంతో ఆయాసపడిపోతూ, నలభై ఏళ్ల సుబ్బారావు ప్లాట్‌ఫామ్ మీద పడ్డాడు. ఓవర్ బ్రిడ్జిమీద వుండగానే గార్డు ఈల వినిపించింది. బ్రిడ్జి దిగగానే ఇంజన్ మోత వినిపించింది. ఇహ లాభంలేదని ఎదురుగా తలుపు తెరుచుకొని వున్న ఒక పెట్టెలోకి ఎక్కాడు. బండి కదిలిన కుదుపుకి ముందుకి తూగడంతో, చేయూత ఇచ్చి అతన్ని పట్టుకున్న అటెండెంటు ముఖం కనిపించడంతో తను మొదటి తరగతిలో పడినట్టుగా గ్రహించుకున్నాడు.

"ఓ.... ఫస్టుక్లాసా...." అన్నాడు బండి ఎక్కగలిగినందుకు 'అమ్మయ్య' అనుకున్న తేలికమనసునే, కొత్త ఇబ్బందిలో పడిపోతూ.

"ఏం.... సెకెండ్ క్లాసు టిక్కెట్టా"

"అవును రిజర్వుడే. ఆలస్యమైపోయింది. ఛట్టున ఇందులో ఎక్కేయాల్సివచ్చింది. తర్వాత స్టేషన్ వరకూ ఎక్స్ట్రా డబ్బు కట్టేసి, మారిపోతానులెండి...."

ముఖాన అల్లుకున్న చెమట కళ్ళజోడుమీద నీటిపొరగా అలుముకోడంతో అతని కళ్లు అటెండెంటుకి కనిపించలేదు- కనిపించి ఉంటే, అతని

రావి కొండలరావు

దీనావస్థ మరింతగా కళ్ళలో ప్రస్ఫుటంగా కనిపించేది. రొప్పుతున్న సుబ్బారావు చెమటను తుడుచుకుంటున్నాడు. చూడ్డానికి ఆఫీసర్లా, చదువుకున్నవాడిలా, వున్నవాడిలా వున్నాడని- [illegible] కూచోండి. తర్వాత స్టేషన్ వచ్చేలోగా' వచ్చి, టిక్కెట్టు రాయిస్తాను." అంది మరీ జాలిపడిపోయిన అటెండెంటు గొంతు, 'థాంక్స్' అన్నాయి సుబ్బారావు పెదవులు.

వేగం పుంజుకుంటున్నానని సుబ్బారావుకు చెప్పడానికి కాబోలు, రైలు గట్టిగా ఓ కూత కూసింది. పెట్టె, బెడ్డింగూ తీసుకొని, గుమ్మం దగ్గర్నుంచి లోపలికి వెళ్లబోతూ, మరోసారి తూలాడు. "డి" కోసం చూడబోయి, తలుపుని ఢీకుని సగం తెరిచివున్న తలుపును మోచేత్తో లాగి, లోపలికి పాదంపెట్టి- ఆగాడు! ఎవరో ఒక్క ఆవిడే కూచుని వుంది. ఓ క్షణం ఆలోచించి, 'ఫర్వాలేదు. అటెండెంట్ చెప్పాడుగదా....' అని సర్ది చెప్పుకుని ఎదురు సీట్లో పెట్టె, బెడ్డింగు పెట్టి కూచున్నాడు. కాలుమీద కాలు వేసుకుని, జేరబడి పుస్తకం చదువుకుంటున్న ఆవిడ, సుబ్బారావు కూచుంటూ వుండగా, కళ్లెత్తి చూసి, ఓసారి కదిలి, మళ్లీ చదవడంలో పడిపోయింది.

సుబ్బారావు 'సుబ్బరం'గ్గా తేలిగ్గా హాయిగా నిదానంగా నిట్టూర్చాడు, కళ్ళజోడు తీసి, చిన్న టవల్‌తో ముఖమూ చేతులూ తుడుచుకున్నాడు. కిటికీ తలుపు వేసివుంటే, తెరిచి, ఉచితంగా పెద్ద మోతాదులో లభిస్తున్న గాలిని నిండుగా పీల్చుకున్నాడు.

ఇప్పుడు పడ్డాయి సుబ్బారావు కళ్లు ఆమె మీద. తలదించుకుని పుస్తకం చదువుకుంటోంది. అతినల్లగా వున్న ఆమె తలవెంట్రుకలు గాలికి కదుల్తూ, ఒక్కోసారి తీవ్రంగా 'స్టంటు' చేసుకుంటున్నాయి. మంచి ఖరీదైన చీరెలో 'స్టయిల్'గా వుందామె. కొద్దిగా కదిలి, కిటికీవేపు ఎందుకో ఆమె చూసినప్పుడు సుబ్బారావు ఆమె ముఖాన్ని చూడగలిగాడు. అందమైన ముఖమే. ముప్పై అయిదు, నలభై ఏళ్లుండచ్చు, అయినా అంత వయసున్నట్టు తెలియనివ్వకుండా నాజూగ్గా ఉంది. యీసారి అతని కళ్లు ఆమె చుట్టుపట్ల ప్రాంతాన్ని పరిశీలించాయి. ఇంగ్లీషు పుస్తకాలూ, పత్రికలూ అటూ ఇటూ పడివున్నాయి. మధ్యలో ఒకటి రెండు తెలుగు పత్రికలు కూడా వుండడంతో, 'పర్వాలేదు తెలుగావిడే' అని తేల్చుకున్నాడు.





కొత్తదనంతో మెరిసిపోతున్న హాండ్‌బాగ్ మీద విదేశీయ పౌడరు డబ్బా, పెర్‌ఫ్యూమ్ సీసా రైలు కుదుపుకి ఒకదాంతో ఒకటి ఆడుకుంటున్నాయి. ఖరీదైన సూట్‌కేసూ, బ్యాగూ, బోషాణం' సైజులో మరోపెట్టె కింద కనిపిస్తున్నాయి. "ఎవరో డబ్బున్న ఆవిడ; చదువుకొన్న ఆవిడ" అని ఒక నిశ్చయానికొచ్చాడు. ఏ ఆఫీసరు భార్య అయివుంటుంది; లేదా ఆఫీసరే అయివుంటుంది. కాని, ఒంటరిగా ప్రయాణం చేస్తోందేం—

ఆమె కదిలి గడియారం చూసుకుంటూ అతన్ని చూసింది. ఆవేళకి ఆమెని పరిశీలిస్తున్న సుబ్బారావు, తను ఆమెనే చూస్తున్నాడని గ్రహిస్తుందేమోనని, టక్కున చూపు మార్చాడు.

డిక్షనరీ అంత లావుగా వున్న ఇంగ్లీషు పుస్తకంలో పేజీ తిప్పిందామె. ప్రొఫెసరా? లెక్చరరా? కలెక్టరా? ఆఫీసరా? ఆమె ఏమిటో కనిపెట్టాలని అతను ఆత్రుత పడిపోతున్నాడు. చుట్టూ వున్న పత్రికల్లో ఒకటి అడిగి, ఆమెతో మాట్లాడితే?.... బావుండదేమో! మరి, తనకెంతసేపు ఇలా కిటికీలోంచి బయట చెట్లనీ టెలిగ్రాఫ్ స్తంభాల్ని చూస్తూ కూచుంటాడు! చదువుకోడానికి తనదగ్గర కనీసం పాతపత్రికకూడా లేదు! ఇలాంటి ఇబ్బందుల్లో వున్న సుబ్బారావుకి, గుండెలో తియ్యని 'ఝల్లు' వినిపించింది.

"బండి లేటుగా నడుస్తోందా?" అని అడిగిందామె. నిస్సందేహంగా తననే అడిగిందామె.

"లేదండి. చాలా కరెక్టు టైములో వుంది ఇవాళ...." అన్నాడు చివరి మాటలో చిన్న వ్యంగ్యం తొణికించానని చిర్నవ్వు చిందించి. ఇహ, ఆమెతో తనూ ఓమాట మాట్లాడాలి. అది తనవంతుగా భావించి, "చాలా దూరం వెళ్తున్నారా?" అని అడిగాడు. అవునని తలవూపింది.

ఐతే, తను ఈలోపలే సాయంకాలానికల్లా దిగిపోతాడు. అంతవరకూ ఇక్కడే కాలక్షేపం చెయ్యొచ్చునే, మళ్లీ రెండోక్లాసుకి ఎందుకూ మారడం?- అన్న ఆలోచన వెంటనే కలిగింది. అటెండెంటు వస్తే టిక్కెట్టు పూర్తిగా రాయించాలి. అన్నట్టు అదో నామోషీ గదా తనకి! ఈమె చూస్తూ వుండగా రాయించకూడదు. బయటికి వెళ్లి అతన్ని పట్టుకుని, అక్కడే మార్పించుకోవాలి.

'మీరేమీ అనుకోకపోతే....' అన్న మాటని ఇంగ్లీషులోకి తర్జుమా చేస్తూ,

పక్కనే వున్న పత్రిక తీసుకున్నాడు. ఆమె మరో రెండు పత్రికలు కూడా అందించింది. గాలిహోరు ఎక్కువైందని కాబోలు, ఆమె కిటికీ ముయ్యబోయింది. కొన్ని నిమిషాలపాటు తనవల్లకాక! ఆమె అవస్థ పడుతూవుంటే, 'మీరేమీ అనుకోకపోతే....' అని మళ్లీ అని సుబ్బారావు వెళ్ళి సహాయం చేసి, కిటికీ అద్దం దించాడు. ఆమెకు దగ్గరగా వెళ్ళడంలో పరిమళాలు గుప్పున కొట్టడం, అతను పరవశించడం కూడా జరిగాయి.

"గాలి ఎక్కువగా ఉంది" అన్నాడు అతను ఏదో గొప్ప విశేషం కనిపెట్టినవాడిలా, ఏం మాట్లాడాలో తెలీక. ఆమె పుస్తకం మడిచి పక్కనపెట్టి, లేచింది. 'వన్ మినిట్' అన్నట్టుగా ఏదో అని బయటికి వెళ్ళింది. వెళ్ళడంలోనూ ఒక 'స్టైయిల్' ఉంది. అలావుండాలి ఆడదంటే! ఎందుకూ, తన భార్యావుంది. పదిహేనేళ్లాయి కాపురం చేస్తోంది. ఓ టేస్ట్‌లేదు స్టైయిల్ లేదు తనకెంత డబ్బుంటేనేం- ఎంత పలుకుబడి వుంటేనేం? ఈరోజుల్లో పల్లెటూరివాళ్ల కూడా ఎంతో స్టైయిల్‌గా కనిపిస్తున్నారు తన కాంతానికి ఎంత చెప్పినా అంతే. ఇద్దరు పిల్లల్ని కన్న తర్వాత మరీ అమ్మమ్మ అయిపోయింది. తన అభిరుచులు, సిద్ధాంతాలూ ఏవీ పనికిరావు. పెళ్ళి కాకముందు, తను కలలు గనేవాడు- భార్య అంటే ఎలా వుండాలో. అంతా విరుద్ధమైపోయింది. ప్రేమించిన పిల్లని చేసుకోడానికి తండ్రి అభ్యంతరం పెట్టాడు. ఆపిల్ల బీదది అయితేనేం- మంచి అభిరుచి వుంది. 'అభిరుచి ఎందుకురా' అని కొట్టిపారేసి, తండ్రిగారు ఈ 'ముద్ద'ని అంటగట్టాడు. తనకు ఊరూరూ తిరగడం అలవాటు. స్నేహితులతో కాలక్షేపం అలవాటు. కాస్త తాగడం అలవాటు. క్లబ్బులకు వెళ్ళడం అలవాటు. ఇవన్నీ మానుకోమంటుందే తనని? తను ఎలా తిరిగితే ఆమెకేం- వ్యాపారం చక్కగా సాగిపోతూ వేలకువేలు వస్తువ్వాయా లేదా! ఎందుకూ చదువుకుంది మళ్లీ. అంతా పాతకాలపు కబుర్లు, సిద్ధాంతాలూ. తను పిల్లల్నీ తననీ సరిగ్గా చూడకుండా ఊళ్ల వెంట తిరుగుతున్నాడనీ, తాగి తందనాలు ఆడుతున్నాడనీ ఫిర్యాదులు చేసి, విడాకులు ఇవ్వబోతోంది- ఇవ్వనీ. తనూ సిద్ధమే అందుకు. ఇవాళేమిటి- ఐదేళ్ళనుంచీ జరుగుతున్నవే ఈ గొడవలు! తానొచ్చి కొడతానుట! కొట్టనూ- నన్ను నిలవేసి ఆమాట అడిగితే! నా ఆరోగ్యం, బాధ్యతా నాకు తెలీవా- అదెవత్తె చెప్పడానికి!....

సుబ్బారావుకి ఇప్పుడు మరింత కోపం వచ్చేసింది భార్యమీద. విడాకులకి తనే ముందు సిద్ధం! ఎప్పుడో జరగాల్సింది. ఈ పాటికి దాన్ని వదిలేసి తన అభిరుచికి తగ్గట్టు ఇంకొకదాన్ని చేసుకొని హాయిగా తిరిగేవాడు. ఛీ! మూర్ఖురాలు! నోటికి ఎంత మాటొస్తే అంత మాటా అంటుంది. తన మాటే నెగ్గాలంటుంది. నేనేం గాజులు తొడుక్కున్నానా- మగాణ్ణి, రెండు చేతులా సంపాయిస్తున్న వాణ్ణి.

ధుమ ధుమలాడుతున్న సుబ్బారావు ఆలోచనల మీద చల్లని పిల్లతెమ్మెర వీచింది. ఆమె బాత్‌రూమ్‌కి కాబోలు వెళ్ళింది, వచ్చి కూచుంది. కూచుంటున్నప్పుడు, కుడి చేతినిండా వున్న గాజులు ఎంతో అందంగా గలగల్లాడాయి!

"మీరు పెద్ద ఉద్యోగస్థులనుకుంటాను...." బండి వేగం తగ్గడంలో శబ్దం తగ్గడంవల్ల, తక్కువ శృతిలోనే అనగలిగాడు, చేతిలో వున్న సిగరెట్టు విసిరేసి.....

"నో నా్న...." అందామె కటువుగా "ఐ యామ్ ఎన్ ఇండిపెండెంట్ లేడీ!"

అతనికి అర్థం కాలేదు అయినా ఊరుకున్నాడు.

"నేను చదువుకొన్నదాన్నే. చదువుకున్న వాళ్ళంతా ఉద్యోగస్థులే అన్న అభిప్రాయం ఎందుకనో మన వాళ్ళలో పాతుకుపోయింది. చదువుకోగానే, ఉద్యోగమేనా? చదువు చదువే, నేనిప్పుడూ ఆ దౌర్భాగ్య స్థితిలో పడలేదు. ఆ అవసరమూ నాకు లేదు!"

"ఆ అవసరం లేదు గనుక, ఆ దౌర్భాగ్య స్థితిలో పడలేదు- అలా చెప్పండి" అనుకున్నాడు సుబ్బారావు మనసులోనే. ఆమె గురించి వివరాలు తెలుసుకోవాలన్న ఆత్రుత పెరగడంతో ఇక మొహమాటం లాభం లేదని, ఇంటర్వ్యూ చేసే పత్రిక మనిషిలాగా ప్రశ్నలు ఆరంభించాలని నిర్ణయించుకొన్నాడు.

"అంటే.... ఏదో ఒక వ్యాపకంలో వుండాలి గదండీ ఎవరైనా.... మరి, ఏం చేస్తారు?"

"ఏమి చెయ్యను. మొదట్నుంచీ ఆస్తి పాస్తులున్నాయి. దర్జాగా స్వతంత్రంగా బతకడమే నాకిష్టం- అన్నదామె పుస్తకం మధ్యంలో 'గుర్తు' పెట్టి మూసేస్తూ.

"వివాహం చేసుకుంటే, స్వతంత్ర జీవనానికి అడ్డమేలెండి మరి. అందుక మానేసి వుంటారు" అన్నాడు. వివాహ విషయం తెలుసుకోవాలన్న తొందర్లో ఏం మాట్లాడాలో ఆలోచించలేదు.

"మానెయ్య లేదు. పెళ్ళి చేసుకున్నాను. ఐతే, ప్రస్తుతం నేను 'మిస్'ని. ఆర్నెల్లయింది విడాకులు తీసుకొని".

సుబ్బారావుకి చెప్పలేనంత ఉద్రేకం, ఉత్సాహం, ఉల్లాసం- అలాంటివన్నీ వచ్చేశాయి. 'చిత్రంగా వుందే' అనుకున్నాడు.

"మీ అభిరుచి అభిప్రాయాలే కారణం అనుకుంటాను".

"అవును" అందామె.

ఆమె పట్ల తనకుగల కుతూహలాన్ని ఎందుకు చంపుకోవాలని సుబ్బారావు వివరాలు అడగడం ఆరంభించి, కొంత తెలుసుకున్నాడు. ఆమె పేరు సురేఖ. వివాహమై పదిహేనేళ్ళయింది. ఒక అబ్బాయి పుట్టాడు. వాడికిప్పుడు పన్నెండేళ్లు. భర్త బాగా వున్నవాడే. పుట్టింటివారి ఆస్తి ఆమెకు బాగా కలిసింది. సురేఖ స్వతంత్ర జీవితం కోరుకుంటుంది. ఎలాంటి ఆంక్షలూ వుండకూడదు. అది భర్తకి నచ్చలేదు. "గృహిణి"గా ఎప్పుడూ ఇంట్లోనే వుండాలంటాడు.

"తొలినుంచీ నాకు స్నేహితులు క్లబ్బులూ ఇష్టం. సరదాగా గడపడం ఇష్టం. ఇంటినిండా నౌకర్లూ, వంటవాళ్లూ వున్నారు. వాళ్లే అన్ని చూసుకుంటారు. ఇంకా నేనేం చూడాలి? కాదట, నేనే చూడాలిట. అబ్బాయిని నేనే రోజూ దగ్గరుండి, అంగుళం అంగుళం పెంచుతూ వుండాలిట. అలాంటివి నాకిష్టం లేదు. నా చెప్పు చేతుల్లో వాడెందుకు పెరగాలి? వాడిష్టం వాడికెలా పెరగాలని వుంటుందో, అలా పెరుగుతాడు! సర్లెండి. మొత్తానికి మా అభిరుచులు వేరు వేరు. ఒకరికీ ఒకరికీ ఎక్కడా పొత్తు కుదర్లేదు. ఒక ఐదేళ్ళపాటు అలా అలా గడిపాం. తర్వాత అసలు కుదర్లేదు. ఎప్పుడూ గొడవలే. ఓసారి, ఆయన నన్ను కొట్టాడు కూడా. ఇహ లాభం లేదని విడాకులు తీసుకున్నాం. ఈ మధ్యనే ఆయన ఇంకో పెళ్ళి చేసుకున్నాట్ట.

తేలిగ్గా చెప్పేసిందామె. కంఠంలో ఎక్కడా తీవ్రత లేదు.

"ఇప్పుడు హాయిగా వుంది నాకు. అభిరుచులు కలవనప్పుడు ఏం ప్రయోజనం! వ్యతిరేక భావాలు వున్నప్పుడు కలిసివుండీ ఏం లాభం?"

సుబ్బారావు చెవులకి ఆనందభైరవి బృందావన సారంగ లాంటి రాగాలు, పిట్టల కువకువలు, సెలవేటి గలగలలూ చిరుగాలి సవ్వడీ- ఇవన్నీ వినిపిస్తున్నాయి ..........

సరిగ్గా తన అభిప్రాయాలే ఆమెవీనూ. ఎక్కడా తేడా లేదు. ఇలాంటి అభిరుచులు గల భార్య దొరికివుంటే ఎంత ధన్యుడయ్యేవాడు తను!

ఏదో స్టేషన్లో ఆగిన రైలు, నెమ్మదిగా బయల్దేరి, వేగం పుంజుకుంది. ఇహ లాభంలేదని, సుబ్బారావు తన కథ కూడా చెప్పేయాలనుకున్నాడు. తన సీట్లోంచి చెబితే సరిగ్గా వినిపించదని, ఆమె సీట్లోకే వెళ్ళి కూచుని,



తను కూడా ఇవే కారణాలవల్ల అవస్థపడిపోతున్నాననీ, తను మధ్య విడాకులు రాబోతున్నాయనీ, తనూ బాగా వున్నవాడినేననీ, తన వ్యాపారం, లాభాలూ ఫలానా అనీ- వివిరంగా చెప్పాడు.

అంతా విన్నాక,

"అభిరుచులు ఒకటి కానప్పుడు, కలిసి వుండడం అవివేకం. ఒకే అభిరుచి, అభిప్రాయం వున్నప్పుడు కలిసి వుండడంలో వున్నంత సుకం ఇంకోటిలేదు" అంది సురేక. ఆమాట సుబ్బారావుకి ఎంతో నచ్చినట్టయింది. నెమ్మదిగాలేచి మళ్ళీ తన సీట్లోకొచ్చి కూచున్నాడు. స్టేషనొస్తున్నట్టుగా వుంది- బండివేగం తగ్గుతోంది. టెలిగ్రాఫ్ తీగలమీద రెండు పిట్టలు దగ్గరగా కూచుని ఎంతో ప్రేమగా కబుర్లు చెప్పుకుంటున్నాయి. పనిపాటలు చేసుకొనే ఒక జంట రైలుపట్టాల పక్కనే వుండే దిబ్బమీద కూచుని, సరదాగా ఊసులాడుతూ గిన్నెలు అందించుకుంటూ తింటున్నారు. స్టేషన్ ప్లాట్‌ఫామ్‌మీద ఒక యువజంట దగ్గరగా నడుస్తూ, నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఈ దృశ్యాలు సుబ్బారావుకి మనోజ్ఞంగా కనిపించాయి. సురేక, ఏం తోచని దానిలా పత్రికతీసి పేజీలు తిప్పుతూ ఆగింది. ఏదో ప్రేమకథ. ఆ ప్రేమికుల జంట చిత్రం ఎంతో అందంగా కనిపించిందామెకు.

సురేఖ అందంగా వుంది; డబ్బువుంది; అభిరుచులున్నాయి; అభిప్రాయ భేదాల కారణంగా విడాకులు పుచ్చుకుంది; తనూ పుచ్చుకోబోతున్నాడు. అంచేత- ఈమెను తను వివాహం చేసుకుంటే ?........ కూచున్న సీట్లోంచి ఎగిరిపడ్డంత ఆనందం కలిగింది అతనికి. భేష్! దివ్యమైన ఆలోచన. కోర్టు ద్వారా విడాకులు పుచ్చేసుకున్న వెంటనే ఈమెను వివాహం చేసేసుకోవచ్చు. తన ఇల్లు, జీవితం స్వర్గమయం అవుతాయి. ఇద్దరూ కలిసి హాయిగా, ఏకాభిప్రాయాలతో, అభిరుచులతో ఏ ఆటంకాలూ లేకుండా జీవితం గడపొచ్చు. తను కన్న కలలిన్నాళ్ళకి ఫలించబోతోంది. ఈభావం కలిగిన తర్వాత, సురేఖని చూస్తే ఆమె మరింత అందంగా కనిపించింది.

సుబ్బారావును సురేఖ పరిశీలనగా చూసింది. అందంగా, ఆరోగ్యంగా వున్నాడు. తనంత రంగు లేకపోయినా, నల్లనివాడు కాదు. అతని కళ్ళజోడు ముఖానికో అందం తెచ్చింది. జుట్టు అక్కడక్కడ తగ్గినా, మరీ 'బట్ట'గా కనిపించడంలేదు అతని అభిరుచులు తాను విన్నది. ఉన్నవాడు, ఉద్యోగంలో లేనివాడు, వేల మీద వ్యాపారం చేస్తున్నవాడూ. ఫ్రెండ్స్, టూర్లు చెయ్యడం సరదా. తనకి తోడుగా రావడానికి అర్హతలన్నీ కనిపిస్తున్నాయి. మరి, తన ఉద్దేశం బయటపెడితే ?.... అతని అభిప్రాయం ఏమిటో! తన గురించి అతనేం అనుకుంటున్నాడో!

రైలు కదిలి వెళ్ళిపోతోంది. జోరుగా మరీ జోరుగా 'ఈల'లు వేసుకుంటూ,

అడ్డూ ఆటంకం లేకుండా సాగిపోతోంది...... సుబ్బారావు వూహాలూ, సురేఖ వూహాలూ అలాగే అంత జోరుగానూ ఒక్కలాగే సాగిపోతున్నాయి! మనసులో విహరిస్తున్న ఆలోచన బయటపెట్టి ఎదుటివారికి చెప్పాలన్న తహ తహ ఇద్దర్లోనూ కనిపిస్తోంది...! కాస్సేపటికి-

"ఏమో!" అనుకున్నాడు సుబ్బారావు. తీరా, తను మనసు విప్పి ఆమెతో చెబితే, ఆమె అంగీకరించక పోతే? అనవసరంగా బయట పడిపోతాడు. తనొక 'ఫూల్' కింద ఆమె జమ కట్టవచ్చు. ఏదో, రైల్లో కొన్ని అరగంటలు కలిసి ప్రయాణించినంత మాత్రాన, పెళ్ళి వరకూ వచ్చేయడమేనా? తుదరపని పని! తన తొందరపాటు, అజ్ఞానం తప్ప మరేం కాదు ఇది! కాకపోతే, తన అభిరుచులే గల ఒక స్త్రీ మూర్తి, తనకి 'జోడు' అనిపించుకోదగ్గ ఒక వనితా రత్నం - సాక్షాత్కరించింది!.... అంతే!....

"ఏమో" అనుకుంది సురేఖ. తన ఉద్దేశం బయటపెట్టి "మనం వివాహం చేసుకుందామా?" అని అడిగితే, ఏమంటాడో! "ఏదో మీరు చెప్పారు గదా అని, నేను చెప్పానుగాని, పెళ్ళి వరకూ తీసుకొచ్చేస్తారా? మీ అభిరుచి వున్నంత మాత్రాన, రైల్లో కలిసినంత మాత్రాన, పెళ్ళి చేసుకుంటాననడమే? అని తీవ్రంగా మాట్లాడితే?".... ఎందుకొచ్చిన గొడవ! అనవసరంగా తను తొందరపడి పోయి నట్టవుతుంది!

అదృష్టవశాత్తు, తనలాంటి వ్యక్తి ఇంకొకడు కనిపించాడు-చాలు! అతని అడ్రసు తీసుకుని, అప్పుడప్పుడు వెళ్ళి స్నేహధర్మంగా కలుస్తూ వుంటే చాలు. అంతే!

చిన్న చిన్న స్టేషన్ల దగ్గర నెమ్మదించినా, రైలు తన పరుగును సాగిస్తూనే వుంది. ఆ పెట్టెలోకి ఇంకెవరూ రాలేదు. ఎవరో ఒకాయన రాబోయాడు గాని, 'భార్యాభర్తల మధ్య తనెందుకు' అన్నట్లు, వెళ్ళిపోయాడు! అటు తరువాత అటెండెంటు రావడం, రాయించిన పూర్తి టిక్కెట్టు అందించి, తేడా డబ్బు తీసుకెళ్ళడం జరిగాయి.... ఒక స్టేషన్లో వచ్చిన కాఫీ ఇద్దరూ తాగడం జరిగింది.... మధ్యలో మరిన్ని విషయాలు ఇద్దరూ ముచ్చటించడమూ జరిగింది....

ఏమైనా, సుబ్బారావు ఆపుకోలేక పోతున్నాడు. మనసులో కోరిక చెప్పేయాలి. టైము గడుస్తున్న కొద్దీ మనసుకు ఆమె మరింత దగ్గరవుతోంది.... మాట్లాడుతున్నకొద్దీ మరింత అందంగా కనిపిస్తోంది.... ఎలాగైనా చెప్పేయాలి. ఆమె తప్పకుండా 'వూ' అంటుంది. తనంటే ఆమెకున్న అభిప్రాయం అర్థమైపోయింది. చూపుల్లో తెలిసి పోయింది. ఆమెనే చూసి తను మాట్లాడుతున్నప్పుడు, సిగ్గుతో తల వంచుకోడం, మధ్యమధ్యలో వయ్యారంగా కళ్ళు ఎత్తి చూడడం తను గమనిస్తూనే వున్నాడు. ఇద్దరూ కాఫీ తాగుతున్నప్పుడు, చేతులూ వేళ్ళూ కలిసినప్పుడు, ఆమె ముఖంలో 'పొడసూపిన' వెన్నెల రేకలు తను గమనించక పోలేదు. అంచేత తన ఊహ చెబితే సురేఖ కాదనదు. కాని -

సుబ్బారావు ఆలోచనా నాణెం రెండో పక్కకి తిరిగింది. ఒకవేళ, అంతా సక్రమమై తాము పెళ్ళి చేసుకుంటే సుఖంగా వుండగలం అన్న గ్యారంటీ - ఏమిటి?- ఏమో, ఆమె తక్కిన గుణాలు ఎలాంటివో! ఫ్రెండ్స్‌తో తిరగడం అంటే ఏమిటో! స్వతంత్రం, స్వేచ్ఛ అన్న పేరుమీద వాడితోనూ వీడితోనూ తిరుగుతూ వుంటే? చదువుతున్నదే కావచ్చుగాని, సంస్కారం ఎలాంటిదో! ఒకసారి భర్తనుకాదని వచ్చేసిన తర్వాత, ఇంకొకడి దగ్గర మాత్రం పేచీ రాదన్న నమ్మకం ఏమిటి?.... అనవసరంగా తను దెబ్బ తింటాడేమో! ఒక భార్యను కాదనుకుంటున్నాడు.... రెండో భార్య కూడా ఇంకేవో కారణాలవల్ల తనకి అచ్చిరాక పోతే?.... తన అలవాట్లు, తిరుగుళ్ళు ఈమెకూడా మానేయమంటే? తాగడానికి వీల్లేదని శాసిస్తే?.... ఏమో, చెప్పలేం. కబుర్లు చెప్పడం చెప్పొచ్చు. ఆచరణ కొచ్చేసరికి, ఎలాంటి దార్లు తొక్కుతాయో! సుబ్బారావు నిట్టూర్చాడు .... తన భార్యకి విడాకులిచ్చేసి హాయిగా



తిరక్కా- మళ్లీ ఎందుకీ రొంపిలో పడడం! వద్దు, అక్కర్లేదు. తను ఆమెను అడగనూ అక్కర్లేదు, ఆమె అవుననీ అక్కర్లేదు! 'ప్లైలావచ్చీసు'గా ఇహ తన జీవితాన్ని గడపాలను కుంటున్నాడు.... చాలు, ఇంకే ఆలోచనా వద్దు!


'బొమ్మ' పక్కనే చూస్తున్న సురేక బొరుసువేపు కూడాచూసింది.... మగాళ్ల కబుర్లు నమ్మడానికి లేదు. తన అభిరుచులకు దగ్గరగా లేదని భార్యను వదిలేస్తున్నవాడు, ఇంకేదైనా కారణం చెప్పి తననీ అలాగే అంటే?....తను స్వేచ్ఛగా తిరగొచ్చుగాని, భార్య అలా తిరక్కూడదు- అని శాసిస్తే-? 'నా యిష్టం. నేను తాగుతాన'ని బుడ్డీలు బుడ్డీలు తాగొస్తే? ఆ మైకంలో గొడ్డును బాదినట్టు బాదితే?....ఛీఛీ. అసహ్యం! ఈ ఆరునెల్లూ ఏ బాదరబందీ, చీకూ చింతా, అడ్డూ ఆక్షేపణా లేకుండా హాయిగా జీవిస్తోంది తను! అభిరుచులు కలిశాయి గదాఅని, మళ్లీ ఈరొచ్చులో పడి జీవితాన్ని పాడుచేసుకోడం ఎందుకు?.... మొదట్లో తన భర్త మాత్రం తనతో ప్రేమగా మాట్లాడలేదా?- అభిమానంగా చూడలేదా? అవన్నీ అప్పటికప్పుడే. తర్వాత అందరూ ఒకటే. స్త్రీని వంటింట్లో వుండమని శాసించే వాళ్ళే! తనను చూడ్డానికి మగాళ్లు రాకూడదనవచ్చు; క్లబ్బులకి వెళ్ళడానికి వీల్లేదనవచ్చు; విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తూ వూరూరా తిరగడానికి ఒప్పుకోనన వచ్చు! ఎలాగూ అనుమానాలూ, అపోహలూ వస్తాయి- 'సీకొకడున్నాడుగా....' అని సమయం వచ్చినప్పుడల్లా ఆక్షేపించవచ్చు! .... ఎందుకూ ఏమీవద్దు. తను ఇలాగే హాయిగా ఉంటుంది. ఎక్కడైనా కనిపిస్తే 'హలో' అని కాసేపు ముచ్చటించడానికీ, బంధాల పేరుతో జైలుశిక్ష అనుభవించడానికీ ఎవతో తేడా ఉంది.

వద్దొద్దు.... ఇంకే ఆలోచనా వద్దు.... మళ్ళీ ఈ పెళ్ళి రొంపిలో దిగొద్దు.... వద్దు!....

సడెన్ బ్రేక్‌తో రైలు ఆగింది. సీటు చివర్లో కూచున్న సుబ్బారావు ముందుకు తూలబోయి, నిభాయించుకున్నాడు. రైలు ఎందుకు ఆగిందా అని, కిటికీలోంచి చూశాడు. స్టేషనేం కాదు- సిగ్నల్ రాలేదు కాబోలు ఆగిందనుకున్నాడు. ఏ ఆత్రుతా, అల్లకల్లోలంలేని మనసుతో వున్న సుబ్బారావు తన స్టేషన్ రావడానికి ఇంకా ఎంతసేపు పడుతుందా అని, గడియారం చూసుకున్నాడు. గాలివాన వెలసిన వాతావరణంలా, ప్రశాంతంగా వున్న సురేక, పుస్తకం చేతిలోకి తీసుకొని అది పూర్తి చెయ్యడంలో నిమగ్నమైపోయింది!

★ ★ ★

# ఆ అనుభవం కావాలి!



వి. మోహన్‌కుమార్